Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి  సంపుటి (Vol) : 6  సంచిక (Issue): 340  పేజీలు (Pages): 4  ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 22 - 5 - 2025

94406 62699  rajadhanivartalu  rajadhaniv  www.rajadhanivartalu.com  RNI No.: APTEL/2019/77985  స్థాపితం: 2015


# జూన్ 5న రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ



**అయోధ్య :** అయోధ్య రామాలయ మొదటి అంతస్తులోని రామ దర్బార్ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జూన్ 5న నిర్వహించనున్నట్లు శ్రీరామ జన్మభూమి నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఈలోపు రామమందిర నిర్మాణం పూర్తవుతుందని, జూన్ 3 నుండి 5 వరకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు వివరించారు. ఈ పవిత్రోత్సవానికి వివిధ మతాలకు చెందిన ఆధ్యాత్మిక నాయకులను ఆహ్వానించన్నట్లు చెప్పారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వీఐపీలు, రాజకీయ నాయకులు ఎవరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం లేదని ఆయన స్పష్టం చేశారు. రామదర్బార్‌లో రాముడు, సీత, లక్ష్మణుడు తదితర దేవుళ్లను దర్శించుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. జూన్ 3 నుంచి 5 వరకు మతపరమైన కార్యక్రమాలు జరుగుతాయని, ఆ తర్వాత భక్తుల దర్శనానికి అనుమతి ఇవ్వనున్నట్లు నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఆలయ నిర్మాణం వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యాలు లేవని.. సుమారు 500 సంవత్సరాలకు పైగా పోరాటం తర్వాత ఈ క్షణం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు అయోధ్యలో రామ్ పథ్, భక్తి పథ్, జన్మభూమి పథ్‌లను అభివృద్ధి చేసిన తర్వాత.. అయోధ్యలో 20 కిలోమీటర్ల పొడవైన భారత్ పథ్ నిర్మించన్నారు. రూ.900 కోట్లతో ఈ ప్రాజెక్ట్ పనులు చేపట్టనున్నట్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది.

# ప్రపంచానికి భారత్ అందిస్తున్న వరం యోగా

**అమరావతి, (రాజధాని వార్తలు):** 11వ యోగా ఇంటర్నేషనల్ డేను ఆంధ్రప్రదేశ్‌లో ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. నాగరికతకు భారతదేశం పెట్టింది పేరన్నారు. యోగా మన వారసత్వమని.. యోగా ఇంటర్నేషనల్ డేగా గుర్తింపు రావడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కారణమన్నారు. యోగా మెరుగైన జీవనానికి దోహద పడుతుందని తెలిపారు. నేడు ప్రపంచంలో అన్ని దేశాల్లో జరుపుకునే కార్యక్రమం యోగా అని చెప్పుకొచ్చారు. యోగా అనేది కొద్దిమందికో లేక.. కొన్ని ప్రాంతాలకో సంబంధించింది కాదన్నారు. అందరి జీవితాల్లో యోగా అనేది ఒక భాగం కావాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరం యోగా అని చెప్పుకొచ్చారు. ఫొటోలు, ఈవెంట్ కోసం ఒక రోజు చేసే కార్యక్రమం కాదన్నారు. ప్రతి ఒక్కరిలో ప్రగాఢమైన మార్పు తీసుకొచ్చే కార్యక్రమం యోగా అని తెలిపారు. యోగా దినోత్సవాన్ని ప్రధాని మోదీ ఒక దీక్ష , పట్టుదలతో చేస్తున్నారన్నారు. నేటి (బుధవారం) నుంచి నెల రోజుల పాటు యోగాంధ్ర -2025పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. 5 లక్షల మందితో వచ్చే నెల 21 తేదీన యోగా డే నిర్వహిస్తామని.. ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో యోగ డే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 10 లక్షల మందికి యోగా సర్టిఫికెట్ ఇస్తామన్నారు. యోగా వల్ల తనకు మానసిక ప్రశాంత ఏర్పడిందని ముఖ్యమంత్రి అన్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు యోగాను ప్రమోట్ చేస్తున్నాయని తెలిపారు. 27 జిల్లాలో నెల రోజులపాటు యోగాంధ్ర పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మీడియా సైతం యోగాను ప్రమోట్ చేసేందుకు కృషి చేయాలని కోరారు. 2,500 మందిని మాస్టర్ ట్రైనర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కాగా.. విజయవాడ హరిత బెరంపార్కులో యోగాంధ్ర జనజాగృతి కార్యక్రమం ఘనంగా



ప్రారంభమైంది. మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు యోగాంధ్ర ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా అవగాహన, శిక్షణ ఇవ్వనున్నారు. నిపుణులు రూపొందించిన యోగా కామన్ ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ, అభ్యాసం చేస్తారు. యోగాలో శిక్షణ పొందిన కనీసం 20 లక్షల మందికి సర్టిఫికెట్ల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జూన్ 21న విశాఖ ఆర్‌కే బీచ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డు స్థాయిలో ప్రజలకు యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని.. ప్రతిఒక్కరూ తమ జీవన మార్గంలో యోగా అభ్యసనాన్ని భాగం చేసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం) ఎంటీ కృష్ణబాబు తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, యోగా ఔత్సాహికులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జగన్ 2.0 కాదు 4.0 చూపించుకున్నా భయపడేది లేదు

## - విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



**ఎన్టీఆర్ జిల్లా, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులపై చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను బెదిరిస్తే చూస్తూ ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. జగన్ ప్రజాప్రతినిధిగా హుందాగా మాట్లాడాలని హితవు పలికారు. వైసీపీలో రౌడీల బాషా అలాగే ఉంటుందని విమర్శించారు. జగన్ 2.0 కాదు 4.0 చూపించుకన్నా తాము భయపడేది లేదని హెచ్చరించారు. నిన్న తిరువూరులో టీడీపీ శ్రేణుల ధాటికి వైసీపీ అల్లరిమూకలు పారిపోయారని విమర్శించారు. తిరువూరులో ఇవాళ (బుధవారం) టీడీపీ మినీ మహానాడు జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ చిన్ని పాల్గొన్నారు. ఎంపీ చిన్ని సమక్షంలో విసన్నపేటకు చెందిన మహిళలు టీడీపీలో చేరారు. ఈ నెల 27వ తేదీన కడప గడపలో జరిగే టీడీపీ మహానాడును జయప్రదం చేయాలని కోరారు. మహానాడుకు టీడీపీ కార్యకర్తలు భారీగా తరలి రావాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు. జగన్‌ను చూస్తే జాలేస్తోందని.. ఆయన ఇప్పటికీ ఊహల్లోనే బతుకుతున్నారని తెలుగుదేశం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి నిన్న చేసిన వ్యాఖ్యలు చూస్తే అధికారులను బెదిరించినట్లు కనిపిస్తుందని అన్నారు. ఇవాళ(బుధవారం) విశాఖపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడారు. జగన్ బెదిరింపు రాజకీయాలకు దిగుతున్నారని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి మారలేదనడానికి ఆయన మాటలే నిదర్శనమని అన్నారు. చట్టం తన పని తాను చేసుకు పోతుందని చెప్పారు. జగన్ హయాంలో అడ్డంగా పనులు చేసిన వారందరూ జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి ఎప్పుడూ ఒకటే మాట చెబుతూ బతికేస్తున్నారని.. ఆయన మాట్లాడే మాటలు మాత్రం మారడం లేదని అన్నారు. కుదిరితే తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి ప్రజా సమస్యల మీద పోరాడాలని అన్నారు. తమ ప్రభుత్వానికి సూచనలు, ఇవ్వాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు.

# మావోలపై విజయం.. ప్రధాని ఇంట్రస్టింగ్ పోస్ట్




**న్యూఢిల్లీ :** ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్‌లో బుధవారం జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ.. మావోయిస్టులను నిర్మూలించిన భద్రతా దళాలను ప్రశంసించారు. 'మీ అద్భుతమైన విజయానికి కారణమైన దళాలను చూసి గర్విస్తున్నాం. మావోయిజం ముప్పును నిర్మూలించడానికి, ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించడానికి మా ప్రభుత్వం కట్టుబడింది' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అంతకు ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన పోస్ట్‌ని ట్యాగ్ చేస్తూ ప్రధాని ఈ పోస్ట్ చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్, బీజాపూర్, దంతెవాడ సరిహద్దు ప్రాంతాల్లో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు, మావోయిస్టుల మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 27 మంది నక్సల్స్ చనిపోయారు. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఇక ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుల అగ్రనేత, నక్సల్ ఉద్యమానికి వెన్నెముక అయిన నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు ప్రాణాలు కోల్పోయాడు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిట ఇన్‌చార్జ్ మధు, మావోయిస్టు పత్రిక జంగ్ ఎడిటర్ నవీన్ కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ప్రధాని మోదీ కంటే ముందు హోంమంత్రి అమిత్ షా కూడా ఎక్స్ వేదికగా కీలక పోస్ట్ చేశారు. నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి విజయం సాధించామన్నారు. బుధవారం నాడు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో భద్రతా దళాలు 27 మంది భయంకరమైన మావోయిస్టులను మట్టుబెట్టారన్నారు. సీపీఐ-మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి, అగ్ర నాయకుడు నక్సల్ ఉద్యమానికి వెన్నెముక అయిన నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు మృతి చెందినట్లు అమిత్ షా ప్రకటించారు. నక్సలిజంపై భారత్ చేసిన మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నాయకుడిని మన దళాలు మట్టుబెట్టడం ఇదే మొదటిసారి అని అమిత్ షా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మావోయిస్టులను హతమార్చిన ధైర్యవంతులైన భద్రతా దళాలు, ఏజెన్సీలను అభినందిస్తున్నానని అన్నారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పూర్తయిన తర్వాత.. 54 మంది నక్సలైట్లను అరెస్టు చేశామని.. 84 మంది నక్సలైట్లు లొంగిపోయారని అమిత్ షా పేర్కొన్నారు. మార్చి 31, 2026 లోపు నక్సలిజాన్ని నిర్మూలించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించిందని హోంమంత్రి స్పష్టం చేశారు.

# కొనసాగుతున్న ద్రోణి.. మరో 12 గంటల్లో..

**విజయవాడ, (రాజధాని వార్తలు):** తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. ఈరోజు రేపు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజుల పాటు కూడా ఈదురు గాలులతో కూడా వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. ఈ రోజు పశ్చిమ, తూర్పు జిలాలకు భారీ వర్షాలు పడతాయని తెలిపారు. అటు తెలంగాణలోనూ పలు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 15 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, నిజామాబాదు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ, గద్వాల్, నగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌బాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.




# తెలంగాణలో భారీ వర్షాలు.. అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం పడుతోంది. వర్షం దంచికొడుతుండటంతో తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఇవాళ (బుధవారం) హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

**ముందు జాగ్రత్తలు తీసుకోవాలి..**

ఈ సందర్భంగా వర్షానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి సీఎం తెలుసుకున్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు ముఖ్యమంత్రి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. జీహెచ్‌ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

**అన్ని శాఖలు అలర్ట్‌గా ఉండాలి..**

అన్ని విభాగాలకు సీఎం రేవంత్‌రెడ్డి రెయిన్ అలర్ట్ జారీ చేశారు. రుతుపవనాలు ముందుగా రాబోతున్నాయని, అన్ని శాఖలు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. 2024లో కురిసిన భారీ వర్షాలకు ఎన్టీఆర్‌ఎఫ్ అందుబాటులో లేకపోవడంతో గోల్డెన్ అవర్ కోల్పోయామని చెప్పుకొచ్చారు. 2024 సెప్టెంబర్ లాంటి ఘటనలు మళ్లీ పునారావృతం కావొద్దని ఆదేశించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, టిజిఎస్‌పి బెటాలియన్ 12 బృందాలు అందుబాటులో ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్‌ఎఫ్ మూడు బృందాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. రంగారెడ్డి, జీహెచ్‌ఎసీలో హైడ్రా అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

**సమన్వయం చేసుకోవాలి..**

జిల్లాల్లో కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు, సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సింగరేణిలో రెస్క్యూ టీమ్స్‌కు ప్రత్యేక ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, డిఎఫ్‌ఓతో కలెక్టర్ సమన్వయం చేసుకోవాలని సూచించారు. రెయిన్ అలర్ట్ సర్క్యులర్‌ను అన్ని జిల్లా కలెక్టర్లకు, శాఖలకు డిజాస్టర్స్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ పంపించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని రాష్ట్ర సీఎస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# విద్యార్థులకు ప్రత్యేక అంశాలపై శిక్షణలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణలో అందిస్తున్నట్టు శాఖ గ్రంథాలయ అధికారిని బందిల రత్నమని అన్నారు. సామర్లకోట శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ఘనంగా సాగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వారి ఉత్తర్వులు మేరకు స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతుల్లో భాగంగా చదరంగంపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి చదరంగం కోచ్ యార్లగడ్డ రాజేష్ విచ్చేసి శిక్షణ అందిస్తున్నట్టు గ్రంధాలాయాధికారిణి బందిల రత్నామణి చెప్పారు. అలాగే చిత్రాలేఖనం పైనా డ్రాయింగ్ టీచర్ కొల్లి పెద్దిరాజు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులను బ్యాచ్ లుగా విభజించి శిక్షణలు ఇస్తున్నట్టు చెప్పారు. ఇంకా గణితంపై కొమ్ము శివశేఖర్ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇంకా వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా నీతి కథలు, జనరల్ నాలెడ్జ్ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో వాహనాల రాకపోకల రద్దీని నియంత్రించేందుకు యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్న వంతెన పనులను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. నడిపూడి లాకు, ఈదరపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెనల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని రహదారులు భవనాల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. నడిపూడి లాకు వద్ద నిర్నిర్మాణ పనుల నిర్వహణ తీరుతెన్నులను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ నిర్దేశిత నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచిం చారు. నిర్మాణ పనులలో ఎటువంటి జాప్యాలకు తావివ్వరాదని ఆయన స్పష్టం చేశారు. నిర్ణీత కాలవ్య వధిలో నిర్మాణ పనులను పూర్తి చేసి జిల్లా వాసులకు అందుబాటులోకి తీసుకు వచ్చి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని ఇంజనీర్‌లకు సూచించారు. ఈ కార్య క్రమంలో రహదారులు భవనాల శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ బి రాము, డివిజనల్ ఇంజనీర్ వర్మ, జూనియర్ ఇంజనీర్ రమేష్, స్థానిక తహసిల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మరిడమ్మ ఆలయంలో పెద్దాపురం జడ్జి కుటుంబం పూజలు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** దేవాదాయ – ధర్మదాయ శాఖ పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మ వారి దేవస్థానంలో పెద్దాపురం జడ్జి జి బుల్లమ్మ కుటుంబం మంగళ వారం ప్రత్యేక పూజలు చేపట్టారు. దేవాలయానికి విచ్చేసిన జడ్జికి దేవస్థాన వేదపండితులు ఆలయ మర్యాదల చొప్పున ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్జి కుటుంబం మరిడమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ వేద పండితులు కుటుంబానికి వేద ఆశీర్వచనం అందించి ఆలయ మర్యాదలతో సత్కరించి, అమ్మవారి తీర్ధ ప్రసాదములను అందజే శారు. ఈ పూజల్లో ఆలయ కార్యనిర్వాహణాధికారి విజయలక్ష్మి,



సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

## - ట్రాఫిక్ ఎస్ఐ వాహనంలో ఆసుపత్రికి తరలింపు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కాకినాడ పోర్ట్‌లోని రైస్ మిల్లులో పనిచేస్తున్న సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామానికి చెందిన నక్క నాగేంద్ర (35) అనే యువకుడు తీవ్రం గా గాయపడ్డాడు. క్షతగాత్రుని ఆసుపత్రికి తరలించే విషయంలో 108 వాహనాలు అందుబాటులో లేకపోవడంతో సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ఆయన పోలీస్ వాహనంలో చికిత్స నిమిత్తం యువకుని మెడికొవర్ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం కాకినాడ పోర్టులోని ఒక రైస్ మిల్లు లో పనిచేస్తున్న హుస్సేన్ పురం గ్రామానికి చెందిన నక్కా నాగేంద్ర మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని తోటి కార్మికు లతో కలిసి మోటార్ సైకిల్ పై హుస్సేన్ పురం గ్రామం వెళు తుండగా వికారాయపురం పెట్రోల్ బంకు దాటిన తర్వాత వెనకనే వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు నాగేంద్ర కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే క్షతగాత్రుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్ వాహనం అందుబాటులో లేకపోవడంతో సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు సంఘటన స్థలానికి చేరుకుని గాయ పడిన యువకుని ఆయన తన పోలీస్ వాహనంలో ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అంబులెన్స్ వాహనాలు అందుబాటులో లేకపోయినా సేవా దృక్పథంతో క్షతగాత్రుని తన





వాహనంలో ఆసుపత్రికి తరలించిన ట్రాఫిక్ ఎస్ఐ ఉదారతను పలువురు అభినందించారు.

# సకాలంలో క్లోజర్ పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** వేసవి కాలువలు మూసి వేత సమయంలో వివిధ గ్రాంట్ల కింద మంజూరైన క్లోజర్ పనులను వేగవంతం చేసి ఋతు పవనాలు వచ్చేలోపు పూర్తి చేసి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సజావుగా సాగునీరు, మురుగు నీరుపారేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జలవనరులు, డ్రైనేజీ విభాగపు అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్‌లో మంగళవారం జలవనరులు, డ్రైనేజీ విభాగ ఇంజనీ ర్లతో సంయుక్తంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు, వివిధ గ్రాంట్ల కింద మంజూరైన పనుల స్థితిగతులపై సమీక్షిం చారు. జలవనరుల శాఖ, సి ఎస్ ఆర్, టి ఆర్ 27 నిధుల ద్వారా మం జూరైన పనులను విడివిడిగా సమీక్షించి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా తూడు తొలగింపు, షట్టర్ల మరమ్మత్తు పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. అత్య వసరమైన పనుల పట్ల మరింత శ్రద్ధ వహించి డెల్టా రైతాంగానికి అండగా నిలవాల న్నారు. గ్రాంట్ల వారీగా పూర్తి చేసిన పనుల నివేదికలను సమర్పించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా జలవ నరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి శ్రీనివాసరావు, జిల్లా డ్రైనేజీ విభాగం కార్యనిర్వహక ఇంజనీర్ ఎం వి వి కిషోర్, వివిధ డివిజన్‌ల డివిజనల్ ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలాలకు దరఖాస్తులు ఆహ్వానం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఇళ్ళ స్థలాల మంజూరుకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తహసీల్దార్ కె చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం అయినా ఒక ప్రకటనలో తెలుపుతూ ఇళ్ల స్థలాలు లేనివారికి ప్రస్తుతం ఇళ్ళ స్థలాల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కునేందుకు వెబ్ పోర్టల్ ఓపెన్ చేయుటం జరిగిందన్నారు. అర్హులైన ప్రజలు వెంటనే వారి దగ్గరలో ఉన్న సచివాలయాల్లో సంప్రదించి ఈ అవకాశమును సద్వినియోగం చేసుకుని ఇంటి పట్టా కొరకు దరఖాస్తు చేసుకోవాలని సందర్భంగా తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

# బ్రిడ్జి పనులు వాయిదా : కలెక్టర్

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణపనుల్లో భాగంగా కాకినాడ రోడ్డులో బ్రిడ్జిలకు గడ్డర్లు లేపే పనులను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు సామర్లకోట నుంచి కాకినాడ వైపుకు వచ్చే కెనాల్ రోడ్డులో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న వంతెనకు ఏర్పాటు చేసే పనులు చేపట్టనున్నట్టు ముందుగా ప్రకటించామన్నారు. అయితే ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వర్షాలు పడుతున్నం దున భద్రత దృష్ట్యా, వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లకుండా ఉండేందుకు ఆ పనులు తాత్కాలికంగా వాయిదా



వేస్తున్నట్లు తెలిపారు. సామర్లకోట నుంచి కాకినాడకు వచ్చే కెనాల్ రోడ్డులో వాహనాల రాకపోకలు మరలా ప్రకటించేంత వరకు యధావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ మార్పును ప్రయాణికులు, వాహనదారులు గమనించాలని ప్రయాణాలు సాగించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

# ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం విజయవంతం చెయ్యండి

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ కౌన్సిల్ సమావేశం జూన్ 5న విజయవాడలో నిర్వహిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి చలో విజయవాడ 3వ కౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను పెద్దాపురం ఎపి జిఇఎ కార్యాలయంలో ఆ సంఘ నాయకులు ఆవిష్కరిం చారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి పాల్గొంటా రని



తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# తహసిల్దార్‌కు సమ్మె నోటీస్ అందజేత




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అంగన్వాడీలు కార్మికుల సమస్యల పరిష్కారానికి గాను ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జూన్ 9వ తేదీకి వాయిదా పడడంతో సమ్మె వాయిదా నోటీసును తహసిల్దార్ కే చంద్రశేఖర రెడ్డికి సామర్లకోట పెద్దాపురం అంగన్వాడి యూనియన్ నాయకులు మంగళవారం అందజే శారు. ఈ సందర్భంగా పెద్దాపురం యూనియన్ కార్యదర్శి వడ్డి ఎస్తేరు, సామర్లకోట సెక్టార్ నాయకులు ఎ వాణిదేవిలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న నిరంకుశ పాలనకు నిరసనగాను, లేబర్ కోడ్ ల రద్దు, కనీస వేతనం రూ. 26 వేలకు పెంపు వంటి అనేక సమస్యలపై చేస్తున్న పోరాటాల్లో భాగంగా జూన్ 9వ తేదీన తమ సిబ్బంది అంత విధులకు హాజరు కాకుండా సమ్మెలో పాల్గొంటు న్నట్టు తహసిల్దార్‌కు తెలిపారు. కాగా ఈ దేశవ్యాప్త సమ్మెలో అంగన్వాడీలు, అందరు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

# కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో జరిగే మినీ మహానాడును జయప్రదం చెయ్యండి

## - బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్ రావు

**విడవలూరు, (రాజధాని వార్తలు):** కోవూరులోని పీవీఆర్ హాల్లో మంగళ వారం 20న సాయంత్రం జరిగే టీడీపీ మినీ మహానాడు ను జయ ప్రదం చెయ్యాలని బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వన మాల జనార్ధన్‌రావు అన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో జరిగే మహానాడుకు టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు ప్రధాన నేతలు పాల్గొని పార్టీ బలోపేతం కొరకు కృషి చెయ్యాలి ని ఆయన విజ్ఞప్తి చేసారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాలన సుస్థిర పాలనగా ఉందని అన్నారు. కోవూరులో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పాలన పారదర్శక తంగా ఉందని బాషా కొనియాడారు.

# ‘కన్నప్ప’ గ్లింప్స్.. మరో పవర్ఫుల్ క్యారెక్టర్ వచ్చేసింది




పాన్ ఇండియా రేంజ్‌కు తగ్గట్టుగా సాలీడ్ స్టార్ క్యాస్ట్‌తో రూపొందుతున్న సినిమా కన్నప్ప. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ పాజిటివ్ వైబ్ క్రియేట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇక లేటెస్ట్‌గా మరో ప్రముఖ నటుడికి సంబంధించిన స్పెషల్ సర్‌ప్రైజ్ ఇచ్చేశారు. మలయాళ మెగాస్టార్ మోహన్‌లాల్ పుట్టినరోజును పురస్కరించుకుని, విష్ణు మంచు అంబిషస్ ప్రాజెక్ట్ ‘కన్నప్ప’ నుంచి ఆయన పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. 27న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ పాన్ ఇండియా సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ స్పెషల్ గ్లింప్స్ వాటిని మరింత పెంచేలా చేశాయి. గ్లింప్స్ చూస్తేనే సినిమా స్థాయికి అర్థమవుతుంది. మోహన్‌లాల్ ఈ చిత్రంలో కిరాత అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. గడ్డంతో కూడిన వయస్సు మించిన యోధుడిగా కనిపించిన ఆయనకు వేషధారణలోనూ, మేకోవర్‌లోనూ భారీ మార్పు కనిపించింది. కేవలం 30 సెకన్లలోని ఈ వీడియోలో ఆయన కళ్ల అభినయంతో, స్క్రీన్ ఫుల్‌గా నిండిపోయింది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ఈ విజువల్‌ను మరింత పవర్ఫుల్‌గా హైలెట్ అయ్యింది. అలాగే టీజర్‌లో విష్ణు క్యారెక్టర్‌కు సంబంధించిన షాట్స్ కూడా హైలెట్ అయ్యాయి. విష్ణు మంచు ఈ సినిమాపై భారీ స్థాయిలో అంచనాలు పెట్టుకున్నట్లు అర్థమవుతుంది. మోహన్‌లాల్ వంటి లెజెండరీ యాక్టర్‌ను యథాతథంగా చూపించటమేకాకుండా, ఆయన కెరీర్‌లో మరో పవర్‌ఫుల్ రోల్‌గా నిలిచేలా ప్రెజెంట్ చేయడంలో టీం విజయం సాధించింది. గ్లింప్స్ చివర్లో వచ్చే సీన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వీడియో విడుదలైన తరువాతే అభిమానుల నుంచి స్ట్రాంగ్ రియాక్షన్ సోషల్ మీడియాలో కనిపిస్తోంది. యూట్యూబ్‌లో కేవలం కొన్ని గంటల్లోనే అద్భుతమైన రెస్పాన్స్‌తో, ఈ వీడియో విపరీతమైన పాపులారిటీ సాధించింది. ఇతర పాత్రలకు సంబంధించి ఇప్పటికే ఆసక్తికర స్పందన లభించింది. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్ వంటి తారాగణం ఉండటంతో, ఈ సినిమా మరో హై లెవెల్ ఫిల్మ్ అవుతుందనే బజ్ మొదలైంది. మ్యూజిక్, విజువల్స్, యాక్షన్ సన్నివేశాల గురించి టీం వేరే లెవెల్ ఫీల్ ఇచ్చేలా ప్లాన్ చేసింది. ఇదంతా చూస్తుంటే జూన్ 27న తెలుగు తెరపై ఒక బిగ్ బాక్సాఫీస్ తరహా విజయం నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ గ్లింప్స్‌తో ‘కన్నప్ప’ ప్రమోషన్ మరో మెట్టు ఎక్కింది. మోహన్‌లాల్ పాత్ర కిరాతగా ముద్ర వేసింది. మరి ఈ వారియర్ పాత్ర సినిమాకు ఎంత పవర్ జోడిస్తుందో రిలీజ్ అనంతరం తేలనుంది.

# సింగపూర్‌కు తరలిన రామ్ చరణ్ విత్ రైమ్!




‘రామ్ చరణ్ విత్ రైమ్’ మైనపు విగ్రహాన్ని ఇటీవల లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. చరణ్ తల్లిదండ్రులు, భార్య ఉపాసన అంతా లాంచింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. తనయుడి మైనపు విగ్రహాన్ని చూసుకుని చిరంజీవి తండ్రిగా ఎంతో గర్వపడ్డారు. తాను సైతం సాధించాలేనివి ఎన్నో తనయుడి సాధిస్తున్నాడని చూసి ఎంతో సంతోష పడ్డారు. తల్లి సురేఖ సంతోషం మాటల్లో చెప్పలేనిది. పట్టరాని ఆనందంలో భార్య ఉపాసన కనిపించారు. అంతా విగ్రహం పక్కనే కూర్చుని ఫోటోలు దిగారు. క్వీన్ ఎలిజబెత్‌టు తర్వాత తన పెంపుడు జంతువుతో విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం కేవలం రామ్ చరణ్‌కు మాత్రమే దక్కడం విశేషం. అలా చరణ్ చరిత్రలో నిలిచిపోయాడు. తాజాగా ఈ విగ్రహాన్ని లండన్ మ్యూజియం నుంచి సింగపూర్ మేడమ్ టుస్సాడ్స్‌కు శాశ్వతంగా తరలించారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. ప్రస్తుతం స్థానికంగా ఉన్న సింగపూర్ ప్రజలంతా చరణ్ విగ్రహాన్ని చూడటానికి తరలి వెళ్తున్నారు.

ప్రజల సందర్శనార్థం సింగపూర్ మ్యూజియంలో విగ్రహం అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం రామ్ చరణ్ హీరోగా పెద్ది చిత్రాన్ని బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తయింది. రిలీజ్ అయిన చరణ్ మాస్ లుక్ ఆద్యంత ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతుంది. చరణ్ ఇంకా తిరిగి షూట్‌లో జాయిన్ అవ్వలేదు. త్వరలోనే టీమ్‌తో కలవనున్నాడు.

# అక్కర్లేని సలహాలు వినను : ఖుషీ కపూర్!




అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా పెద్ద కుమార్తె జాన్వీకపూర్ లెగసీని ముందుకు తీసుకు వెళుతోంది. జాన్వీతో పాటు, ఇటీవల శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ కూడా రేసులోకి వచ్చింది. ఖుషీ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటించింది. ది ఆర్చీస్ వెబ్ సిరీస్‌తో ఆరంగేట్రం చేసిన ఖుషీ ఆ తర్వాత లవ్ యాపా, నాదానియాన్ లాంటి చిత్రాల్లో నటించింది. కానీ ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లు అయ్యాయి. ది ఆర్చీస్ అంతగా మెప్పించలేదు. ఆ మూడింటిలో నటీనటుల ప్రదర్శనపైనా అంతగా ప్రశంసలు లేవు. అయితే తనపై వచ్చిన విమర్శలపై ఖుషీ కపూర్ తాజా ఇంటర్వ్యూలో స్పందించింది. విమర్శలు నిర్మాణాత్మకంగా ఉంటే వాటిని పట్టించుకుంటానని, ఒకవేళ అక్కర్లేని విమర్శలు చేస్తే దానిని పట్టించుకోవాల్సిన పని లేదని కూడా ఖుషీ కపూర్ అభిప్రాయపడింది. తన కెరీర్ ఎదుగుదలకు సహకరించే విమర్శలు కావాలని స్పష్టంగా చెప్పింది. కెరీర్ ప్రారంభంలో తనకు ఇవేవీ అర్థం కాలేదని, నెమ్మదిగా మూడు ప్రాజెక్టులు చేసాక ఇప్పుడు సమాధానమిచ్చే వయసు వచ్చిందని కూడా ఖుషీ చెప్పింది. ఇప్పుడు అన్నిటికీ ప్రతిస్పందించగలనని ఖుషీ అంది. నాకు ప్రతిదీ వినే అలవాటు ఉంది. ప్రతిదీ విని నేర్చుకుంటున్నాను.. మెరుగు పరుచుకుంటున్నాను.. అవసరం లేని కువిమర్శల్ని పట్టించుకోనని కూడా ఖుషీ తెలిపింది. నేను సినిమా సెట్ల చుట్టూ పెరిగినందున (నటన పట్ల) ప్రేమ మొదటి నుంచీ ఉంది... సౌకర్యం ఉంది... మనం ఎంపిక చేసుకునేవాటిపై నమ్మకంగా ఉంటాం. నేను మూడు సినిమాలు చేసినందున ఇప్పుడు ఎక్కువ స్వరం వినిపించగలనని భావిస్తున్నాను. నేను నా ఆలోచనలను కొంచెం ఎక్కువగా వ్యక్తపరచగలను.. అని చెప్పింది.

జోయా అక్తర్ దర్శకత్వం వహించిన ‘ది ఆర్చీస్’ 2023 లో ఖుషీ కపూర్ బెట్టీ కూపర్ పాత్రతో అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 2025 లో లవ్‌యాప – నాదానియన్ అనే రెండు చిత్రాలలో నటించింది. లవ్ యాపాలో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటించాడు. నాదానియన్‌తో సైఫ్ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ కథానాయకుడిగా పరిచయం అయ్యాడు.

# ఎవరు ఈ నటి? కేన్స్ 2025లో మోదీ నెక్లెస్‌తో షాకిచ్చింది!



కేన్స్ (ఫ్రాన్స్) సినిమా ఉత్సవాల్లో ఈసారి భారతదేశం నుంచి పలువురు కథానాయికలు సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఐశ్వర్యారాయ్, నందితా దాస్, జాన్వీ కపూర్, అదితీరావ్ హైదరీ సహా పలువురు కేన్స్‌లో సందడి చేసారు. ఇషాన్ ఖత్తర్, ఒర్రీ, ఊర్వశిరౌతేలా కూడా సందడి చేస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. ఇదిలా ఉంటే, రాజస్తాన్ కి చెందిన రుచి గుజ్జర్ వేషధారణ కేన్స్‌లో హాట్ టాపిగ్గా మారింది. ఈ భామ భారీతనం నిండిన రాజస్థానీ డిజైనర్ లెహంగాను ధరించి కనిపించింది. అయితే తన మెడలో ప్రత్యేకంగా డిజైన్ చేసిన నెక్లెస్ అందరి దృష్టిని ఆకర్షించింది. దీనికి కారణం ఆ నెక్లెస్‌లో భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోని ఉంచి డిజైన్ చేయడమే. ఒక దేశ ప్రధానిని ఇలాంటి వేదికకు తీసుకు రావడానికి కారణం ఉందని రుచి గజ్జర్ వెల్లడించింది. ప్రపంచ పటంలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చి ఉన్నత శిఖరాలకు చేర్చిన దేశ ప్రధాని నరేంద్ర మోదీని గౌరవించాలనుకున్నాను! అని గుజ్జర్ వ్యాఖ్యానించింది. రూప శర్మ రూపొందించిన విలాసవంతమైన భారీ డిజైనర్ లెహంగా ఈ వేదికకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జరిబారికి చెందిన రామ్ తన దుపట్టాను రూపొందించాడు. జర్దోజీ దుపట్టా రాజస్తానీ సాంస్కృతిక వారసత్వానికి సింబాలిక్ అని తెలిపింది రుచీ. సైనిక కుటుంబం నుంచి వచ్చిన రుచి గుజ్జర్ దేశభక్తి పరురాలు. రాజస్తాన్ నుంచి ముంబైకి నటి కావాలని వచ్చింది. నిజానికి గుజ్జర్‌లు మహిళలు నటనలోకి వెళ్లడానికి వ్యతిరేకం. కానీ దానిని నిరసిస్తూ తాను నటనలోకి ప్రవేశించాలనుకున్నానని కూడా రుచి గుజ్జర్ వ్యాఖ్యానించింది. బాలీవుడ్ పరిశ్రమలో ఇంత దూరం వచ్చిన ఏకైక వ్యక్తిని. నా తండ్రి చాలా మద్దతుగా నిలిచారని తెలిపింది. ముంబైకి వెళుతున్నానంటే తన తల్లి మొదట్లో భయపడిందని, కానీ ఇప్పుడు తాను ఎంత దూరం వచ్చానో చూసి గర్వంగా ఉందని వెల్లడించింది. రుచి అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 798కే ఫాలోవర్లు ఉన్నారు. సోషల్ మీడియాల ద్వారా ఈ భామ ఆర్జిస్తోంది.

# చింతపల్లి చైతన్యం...యోగా దినోత్సవం సందేశంతో ప్రారంభం

## - ఎంపీపీ అనూష దేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు నేతృత్వంలో అవగాహన ర్యాలీ





**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం చింతపల్లి మండల కేంద్రంలో వైభవంగా యోగా అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీడీవో యు.వి.ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి చాటి చెప్పారు. ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, నిత్యజీవితంలో యోగా ఆవశ్యకతను ప్రతిపాదించే విధంగా శరీర శక్తి, మానసిక ప్రశాంతతను అందించే యోగా భంగిమలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏ.టి.డబ్ల్యూఓ జయ నాగలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు లోచలి వరలక్ష్మి, ఉపాధ్యాయులు సాగిన లింగన్న పడాల్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది విశేషంగా పాల్గొన్నారు.

# వాహనదారుల ప్రయాణానికి అడ్డుగోడలైన పశువులు

## - నిర్లక్ష్యపు యజమానులు...రాత్రి వేళల్లో రోడ్డుపై మృగాల మౌన సభ





**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం పరిధిలోని లోతుగడ్డ–చెరుకుంపాకల ప్రధాన రహదారిపై పశువుల సంచారం రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో పశువులు రహదారిపై నిద్రించడంతో పాటు, స్వేచ్ఛగా తిరుగుతూ వాహనదారులకు తీవ్ర అవాంతరంగా మారుతున్నాయి. పశువుల యజమానులు వాటిని నియంత్రించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల, ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి సమయాల్లో, ప్రత్యేకంగా కాంతులేని ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఈ విషయంలో పశు సంరక్షణ శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని పశువులను గోశాలల్లో ఉంచే చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించి, సంబంధిత అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# జనచైతన్యానికి బాట వేసిన యోగాంధ్ర... కమిటీలు, శిక్షణలతో కార్యాచరణ

**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర క్యాంపెయిన్' కార్యక్రమానికి చింతపల్లి మండలంలో ఘనంగా ఆరంభం పలికింది. మే 21 నుండి జూన్ 21 వరకు ఒక నెలపాటు జరిగే ఈ ప్రత్యేక ప్రచారంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మందిని భాగస్వాములుగా మార్చే లక్ష్యంతో యోగా సేవా సూత్రం విస్తృతంగా ప్రచారానికి వస్తోంది. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కోరాబు అనూష దేవి, ఎంపీడీవో యు.వి.ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ క్యాంపెయిన్ ప్రకారం మే 21–27: ట్రైనింగ్ అండ్ ట్రైనర్స్ శిక్షణ, మే 28–జూన్ 3: మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, జూన్ 4–16: గ్రామ/వార్డు స్థాయిలో శిక్షణలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మండల స్థాయిలో ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన కమిటీని, అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి






అధ్యక్షతన స్థానిక కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై తమ మద్దతు తెలిపారు.

# ప్రపంచానికి మెడికల్ హబ్‌గా ఇండియా

## - వైద్య ఖర్చులు మన దగ్గరే తక్కువట

**ఇంటర్నెట్ డెస్క్ :** ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో వైద్య ఖర్చులు చాలా తక్కువగా ఉన్నాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇది నిజంగా భారతీయులకు, అలాగే విదేశాల నుంచి వైద్యం కోసం వచ్చే వారికి శుభవార్తే అని చెప్పొచ్చు. ముఖ్యంగా క్లిష్టమైన శస్త్రచికిత్సల విషయంలో కూడా మన దేశం చాలా సరసమైన ధరలకే ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందిస్తోందని నివేదికలు చెబుతున్నాయి. ఒక హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ (గుండె మార్పిడి) తీసుకుంటే ఇండియాలో దీనికి సుమారు రూ.4.5 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చవుతుంది. అమెరికాలో మాత్రం ఏకంగా రూ.1.4 కోట్ల వరకు ఖర్చవుతుందని తేలింది. అంటే, మన దేశంలో గుండె మార్పిడి ఖర్చు అమెరికాతో పోలిస్తే దాదాపు 30 రెట్లు తక్కువ. సింగపూర్, సౌత్ కొరియా వంటి దేశాల్లో కూడా వైద్య ఖర్చులు భారీగానే ఉంటాయి. గుండె బైపాస్ సర్జరీ, హిప్ రీప్లేస్‌మెంట్, యాంజియోప్లాస్టీ, డెంటల్ ఇంప్లాంట్, కిడ్నీ మార్పిడి వంటి అనేక ప్రధాన చికిత్సల విషయం లోనూ ఇదే పరిస్థితి. ఉదాహరణకు, బైపాస్ సర్జరీకి మన దగ్గర రూ. 2.5 లక్షల నుంచి రూ. 4.5 లక్షల వరకు ఖర్చవుతుండగా ఇతర దేశాల్లో దీనికి రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఎందుకు ఇండియాలో ఆపరేషనల్ ఖర్చులు తక్కువ. మన దేశంలో ఆస్పత్రుల నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీతాలు, పరికరాల కొనుగోలు ఖర్చులు ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువగా ఉంటాయి. ఇండియాలో అర్హత కలిగిన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నారు. దీనివల్ల కార్మికుల కొరత ఉండదు. వేతనాలు కూడా ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉంటాయి. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులు తక్కువ ఖర్చుతో సేవలు అందిస్తూ, ప్రైవేట్ ఆస్పత్రుల పై ధరల విషయంలో ఒక పోటీని సృష్టిస్తాయి. మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం వివిధ చర్యలు చేపడుతోంది. మెడికల్ టూరిజంలో దూసుకెళ్తున్న ఇండియా భారత దేశంలో తక్కువ ఖర్చులతో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది రోగులు చికిత్స కోసం మన దేశాన్ని ఆశ్రయిస్తున్నారు. దీన్నే మెడికల్ టూరిజం అంటారు. హైదరాబాద్ వంటి నగరాలు ఇప్పటికే మెడికల్ టూరిజానికి గ్లోబల్ హబ్‌లుగా మారుతున్నాయి. యూరప్, అమెరికా వంటి దేశాలతో పోలిస్తే తెలంగాణలో చికిత్స ఖర్చులు 60 నుంచి 80 శాతం తక్కువగా ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. అందుకే విదేశాల నుంచి పెద్ద ఎత్తున రోగులు ఇక్కడికి వస్తున్నారు. క్లిష్టమైన సర్జరీలు, క్యాన్సర్ చికిత్సలు, గుండె సంబంధిత వ్యాధులు, అవయవ మార్పిడి వంటి వాటికి మన దేశం ఒక నమ్మకమైన చికిత్సా కేంద్రంగా మారుతోంది. ప్రపంచ స్థాయి సౌకర్యాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, నిష్ణాతులైన వైద్య నిపుణులు తక్కువ ధరకే అందుబాటులో ఉండటం వల్ల ఇండియా వరల్డ్ ఫార్మసీగానే కాకుండా, వరల్డ్ హెల్త్‌కేర్ డెస్టినేషన్ గా కూడా రూపాంతరం చెందుతోంది. ఈ నివేదికలు భారత్ వైద్య రంగంలో మరింత బలపడటానికి దోహదపడతాయని చెప్పొచ్చు.



# వేసవి శిక్షణ శిబిరం





**మైలవరం, (రాజధాని వార్తలు):** మైలవరం శాఖా గ్రంధాలయం నందు విద్యార్థినీ, విద్యార్థులకు ఎల్‌హెచ్ఆర్ స్కూల్ (ఎస్ఏ), ఉపాధ్యాయులు బిఎస్‌సి.బోస్ భారతదేశంలో ప్రవహించే నదులు వాటి జన్మ స్థలాలు అనే అంశం గురించి వివరించడం జరిగింది. దేశంలోనే అతి పురాతన నది గోదావరి దీనినే వృద్ధగంగ, దక్షిణ గంగ, భారతదేశ రెయిన్ నది అని కూడా పిలుస్తారు. మహారాష్ట్రలోని నాసిక్ సమీపాన గల త్రయంబకేశ్వరం వద్ద పశ్చిమ కనుమల్లో జన్మించి ఉభయగోదావరి జిల్లాల ద్వారా ఈ నది ప్రవహిస్తూ, ఏడు శాఖలుగా విడిపోయి బంగాళాఖాతంలో కలుస్తుంది అందువలన దీనిని సప్త గోదావరి (గౌతమి, వశిష్ట, వైనతేయ, తుల్య, భరద్వాజ, కౌశిక, ఆత్రేయ) అని కూడా పిలుస్తారు అని విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# వన్యప్రాంతాల్లో మార్పుకు మార్గదర్శిగా సత్యనారాయణ

## - నేడు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం

**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మన్యప్రాంతాల్లో జీవవైవిధ్య పరిరక్షణకు విశేష కృషి చేసిన గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు, కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణకు ప్రతిష్ఠాత్మక జీవ వైవిధ్య రక్షక అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు తరఫున ప్రతి ఏడాది ప్రదానం చేసే ఈ అవార్డు కోసం ఆయన ఎంపిక కావడం గర్వకారణమని సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఈ అవార్డు మే 22న విజయవాడలో జరుగనున్న ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు. గత రెండు దశాబ్దాలుగా చింతపల్లి, జీకేవీధి, కోయ్యూరు మండలాల్లో గిరిజనుల జీవనోపాధి అభివృద్ధి, సహజ వ్యవసాయం ప్రోత్సాహం, సేంద్రీయ వ్యవసాయ విధానాల పరిరక్షణ కోసం ఆయన విశిష్టంగా కృషి చేశారు. నాబార్డు మాతోట పథకం ద్వారా వందలాది ఎకరాల్లో తోటల అభివృద్ధి చేయడంతో పాటు, గిరిజన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సేంద్రీయ ధ్రువీకరణ పొందిన కాఫీకి ప్రత్యేక బ్రాండింగ్ కల్పించడంలోనూ ఆయన కృషి కీలకంగా నిలిచింది. ఈ పురస్కారం తమ సంస్థ ప్రయాణానికి నూతన ప్రేరణగా నిలుస్తుందని, వన్యప్రాంతాల్లో జీవవైవిధ్య పరిరక్షణకు తమ సంకల్పం మరింత బలపడుతుందని వెంకట సత్యనారాయణ అభిప్రాయపడ్డారు.





# నేడు అనకాపల్లిలో తిరంగా ర్యాలీ

## - ప్రజలంతా తరలి రావాలి : సీఎం రమేశ్

**కొత్తూరు, (రాజధాని వార్తలు):** ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా బీజేపీ దేశ వ్యాప్తంగా తిరంగా యాత్ర నిర్వహించనుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రివిధ దళాలతో పాటు ఇతర సాయుధ దళాల ధైర్య సాహసాలను అభినందిస్తూ, ప్రాణత్యాగం చేసిన సైనికుల గౌరవార్థం ఈనెల 22న అనకాపల్లిలో ర్యాలీ చేపట్టనున్నట్టు వివరించారు. ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలోని సన్యాస్టల్ హెూటల్ నుంచి ర్యాలీ ప్రారంభమై నెహ్రూచౌక్ కూడలి వరకు సాగుతుందని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, కూటమి శ్రేణులు తరలి రావాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan